RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్


మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts




వరంగల్ | సంపుటి 2 | సంచిక 110 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం | 23.10.2026 | పేజీలు : 8

# కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

## - సీఎం రేవంత్ కీలక ప్రకటన

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ



**నిత్యం నిఘా, హైదరాబాద్ :** బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు. తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ .... 2

## స్మిత్ మచ్చర్‌తో కలిసి మోదీ జ్యోతి ప్రజ్వలన..

### - ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు



2

## అమిత్ షాకు బర్త్ డే విషెస్ తెలిపిన సినీ ప్రముఖులు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు
- సోషల్ మీడియాలో విషెస్ తెలిపిన సినీ ప్రముఖులు
- ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక శుభాకాంక్షలు
- మహేష్ బాబు, కంగనా రనౌత్, రితేశ్ దేశ్‌ముఖ్, తమిళనాడు సీఎం విజయ్ కూడా విషెస్
- దేశానికి సేవ చేసే శక్తినివ్వాలని ఆకాంక్షించిన ప్రముఖులు



2


## సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం



2

## వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. రూ. 382 కోట్లు మంజూరు

- వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు
- మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్
- వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం



**నిత్యం నిఘా, వరంగల్ :** కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, ..... 2

## హైడ్రాపై పోలీస్ అధికారి పాట.. పుట్టినరోజున ఆవిష్కరించిన కమిషనర్ ఏవీ రంగనాథ్



- హైదరాబాద్ నగరంపై రూపొందించిన అవగాహన గీతం విడుదల
- హైడ్రా రాకతో నగరంలో వచ్చిన మార్పును వివరిస్తూ పాట
- ఈ గీతాన్ని ఆలపించిన రాంగోపాల్‌పేట సీఐ బోడసింగి సురేశ్ కుమార్
- కమిషనర్ ఏవీ రంగనాథ్ తన పుట్టినరోజున ఈ పాటను ఆవిష్కరించారు
- సీఐ సురేశ్ కుమార్ ప్రయత్నాన్ని కమిషనర్ అభినందించిన వైనం 2

## డిండికి నీటి తరలింపు ఆపండి

### - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన



2

## గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

### - ధర్మపురి అర్వింద్

- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న ఎంపీ అర్వింద్
- గడ్డం పెంచితే కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరంటూ వ్యంగ్యాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు చర్చలు జరుగుతున్నాయని ఆరోపణ



2

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

### - 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తుల ప్రశంస



**నిత్యం నిఘా, హైదరాబాద్ :** ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు ..... 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

## - సీఎం రేవంత్ కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి..** జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పని తీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్..

# రూ. 382 కోట్లు మంజూరు

**మొదటిపేజీ తరువాయి..** మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

# సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి..** సిరిసిల్లలో త్వరలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

# హైడ్రాపై పోలీస్ అధికారి పాట..

## పుట్టినరోజున ఆవిష్కరించిన రంగనాథ్

**మొదటిపేజీ తరువాయి..** విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూనే, తనలోని కళతో సామాజిక చైతన్యానికి పాటుపడుతున్నారు రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బోడసింగి సురేశ్ కుమార్. హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' రాకతో వచ్చిన మార్పును వివరిస్తూ ఆయన ఆలపించిన ఓ ప్రత్యేక గీతాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఆవిష్కరించారు. కమిషనర్ రంగనాథ్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఈ పాటను విడుదల చేయడం విశేషం. గతంలో హైదరాబాద్ నగరం ఎలా ఉండేది, ఆక్రమణల వల్ల వరదలతో ఎలా మునిగిపోయేది, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ కాలువలు ఎలా పూడుకుపోయాయో ఈ పాటలో వివరించారు. హైడ్రా వచ్చిన తర్వాత నగరం ఎలా సురక్షితంగా మారిందనే అంశాన్ని సురేశ్ కుమార్ తన గాత్రంతో ఆకట్టుకునేలా ప్రస్తావించారు. సురేశ్ కడారి రాసిన ఈ పాటకు కల్యాణ్ కీస్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, సీఐ సురేశ్ కుమార్ ప్రయత్నాన్ని అభినందించారు. విధులను నిర్వర్తిస్తూనే, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ప్రశంసనీయమని అన్నారు. ఇటీవల గణేశ్ ఉత్సవాల సమయంలో డీజే సౌండ్స్‌పై సురేశ్ కుమార్ పాడిన పాట మంచి అవగాహన కల్పించిందని గుర్తుచేశారు. గతేడాది కూడా కమిషనర్ రంగనాథ్ పుట్టినరోజున వలస బతుకులపై సురేశ్ కుమార్ ఓ పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి నగర సమస్యపై తన గళాన్ని వినిపించి అందరి మన్ననలు పొందుతున్నారు.

# ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

## - 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

**మొదటిపేజీ తరువాయి..** దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

# స్మిత్ మచ్చర్‌తో కలిసి మోదీ జ్యోతి ప్రజ్వలన..

## ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి..** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం. గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లెదుబాయ్' విమానంలో తన సహా పైలట్ జెరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

# అమిత్ షాకు బర్త్ డే విషెస్ తెలిపిన సినీ ప్రముఖులు

**మొదటిపేజీ తరువాయి..** కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబరు 22 న పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకులతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు, అమిత్ షాకు తన శుభాకాంక్షలను 'ఎక్స్' ద్వారా తెలియజేశారు. "గౌరవనీయ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఇదే శక్తి, ఉత్సాహంతో దేశానికి సేవ చేస్తూనే ఉండాలి. ఈ ఏడాది మీకు గొప్పగా ఉండాలని కోరుకుంటున్నాను సార్" అని మహేశ్ బాబు తన పోస్టులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అమిత్ షాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "గౌరవనీయ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. దేశానికి అంకిత భావంతో సేవ చేసేందుకు మీకు మంచి ఆరోగ్యం, బలం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. సురక్షితమైన, సుసంపన్నమైన, వికసిత భారత్ నిర్మాణంలో మీరు మరెన్నో ఏళ్లు సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పవన్ కల్యాణ్ వివరించారు. టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ స్పందిస్తూ, "గౌరవనీయ హోంమంత్రి అమిత్ షా గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీకు మంచి ఆరోగ్యం, బలం, విజయం కలగాలని కోరుకుంటున్నాను సార్" అని అన్నారు. నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, "భారత కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి గౌరవనీయ అమిత్ షా గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని, దేశ ప్రగతికి ఇలాగే తోడ్పడాలని శ్రీరాముడిని ప్రార్థిస్తున్నాను. జై శ్రీరామ్!" అని ట్వీట్ చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్ కూడా అమిత్ షాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పలువురు సినీ తారలు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకుంటూ పోస్టులు పెట్టారు.

# డిండికి నీటి తరలింపు ఆపండి

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

**మొదటిపేజీ తరువాయి..** డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాదలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు. సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా..?

## - ధర్మపురి అర్వింద్

**మొదటిపేజీ తరువాయి..** నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# పారిశుద్ధ్య కార్మికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

- **రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.

గురువారం హనుమకొండలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు నూతన యూనిఫారాలు, ఆప్రాన్లు, రక్షణ బూట్లు, గ్లౌజులను అందజేశారు.

### రక్షణ పరికరాల వినియోగం తప్పనిసరి

విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం అందించిన రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత వంటి పనులు చేపట్టే సమయంలో గ్లౌజులు, రక్షణ బూట్లు ధరించడం ద్వారా ఇన్‌ఫెక్షన్లు, గాయాల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు.

### కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమం, భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో బస్టాండ్ రోడ్డు అభివృద్ధి పనులు

**హనుమకొండ, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బస్టాండ్ రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

### గత పాలకుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా రహదారులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యాయని విమర్శించారు. గత పాలకుల అసమర్థతతో నగరంలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

### అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలి

రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం మానుకొని, నియోజకవర్గ అభివృద్ధికి నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు



అందించాలని బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరకాసుర వధ ఉత్సవానికి భారీ పోలీసు బందోబస్తు

- **పోలీస్ కమిషనర్ శ్వేతకు ఆహ్వాన పత్రిక అందజేసిన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి**

**వరంగల్, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించనున్న నరకాసుర వధ ఉత్సవాలు సజావుగా జరిగేలా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. గురువారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం, ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ తీరును అధ్యక్షుడు మరుపల్ల రవి పోలీస్ కమిషనర్‌కు వివరించారు. ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి ఉర్సు గుట్ట వరకు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో, డప్పు చప్పుళ్ల నడుమ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహంతో వధ ఉత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఈ ఉత్సవాలకు వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కొండా సురేఖతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వేలాది మంది భక్తులు హాజరుకానున్నట్లు కమిటీ అధ్యక్షుడు తెలిపారు.

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అవసర మైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ శ్వేత హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, భక్తులు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగ



కుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు. భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లలో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతమ్, దూడ బాల కొమురెల్లి, వనం కుమార్, ఆవునూరి రామన్న, మాటేటి శ్యామ్, కుండె రాజు, ఆవునూరి ఐలేశం, కుండె సదానందం, దాసరి రాజు, పోలం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు సీజ్

- **అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు**

**పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** ప్రభుత్వానికి రైస్ మిల్లుల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బకాయిల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

గురువారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జి. శ్రీరాములుతో కలిసి రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బకాయిల చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న డిఫాల్టర్ రైస్ మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాల వివరాలను వెంటనే సేకరించాలని ఆదేశించారు.

### రెండు, మూడు రోజుల్లో బకాయిలు చెల్లించాలి

పెండింగ్ బకాయిలను రెండు, మూడు రోజుల్లోగా చెల్లించాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం సంబంధిత రైస్ మిల్లుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



### ఆస్తుల వివరాలు సేకరించాలి

బకాయిల వసూళ్లకు సంబంధించి డిఫాల్టర్ రైస్ మిల్లర్లు, వారి కుటుంబ సభ్యుల ఆస్తుల లావాదేవీల వివరాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్, డీసీఓ శ్రీమాల, ఆర్డీఓ గంగయ్యతో పాటు సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# రంగశాయిపేట పట్టణ పీహెచ్‌సీని నూతన భవనంలోకి తక్షణమే మార్చాలి



**వరంగల్, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** రంగశాయిపేటలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనంలోకి తక్షణమే తరలించాలని కోరుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు మండల పరశురాములు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతి పత్రం సమర్పించారు.ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య సేవలు పొందేందుకు స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు వైద్య సేవల కోసం అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటికే నిర్మించిన నూతన ఆసుపత్రి భవనంలోకి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే తరలించాలని కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు. నూతన భవనంలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి, ఆసుపత్రి తరలింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మండల పరశురాములు విజ్ఞప్తి చేశారు.

# వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వేరో డే

- **ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా కార్యక్రమం**

**వరంగల్ జిల్లా/పర్వతగిరి, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** గురుకులాల వ్యవస్థాపకులు ఎస్ఆర్ శంకరన్ జయంతిని పురస్కరించుకొని స్వేరోస్ రాష్ట్ర కమిటీ సూచనల మేరకు గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో స్వేరో డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వేరోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికట్ల ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఆర్‌పీ పుల్ల కిషన్ స్వేరో, జోనల్ ఇన్‌చార్జి ఒంటేరు చక్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఆర్ శంకరన్ సేవలను స్మరించుకుంటూ, సమాజ అభ్యున్నతికి స్వేరోస్ చేస్తున్న కృషిని వివరించారు. ముఖ్యంగా అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే అంశాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడానికి స్వేరోస్ కృషి చేస్తోందని తెలిపారు. స్వేరోస్ ఆశయాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించి, విద్యా, సామాజిక అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గారే జయరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెడుపాక సిద్ధూ, జిల్లా కమిటీ సభ్యులు బాణోతు రమేష్, ధారావత్ జీవన్ కుమార్, వినోద్, గౌతమ్, రవి చత్రపతి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** మంథని పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయానికి నూతన కమిటీని నియమించినట్లు ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ నూతన కమిటీ అధ్యక్షురాలిగా మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పనకంటి మురళీధర్‌రావు, కోశాధికారిగా మహావాది సతీష్‌కుమార్ నియమితులయ్యారు. భజన మండలి కన్వీనర్‌గా సిద్ధాంత లక్ష్మీశ్రీనివాస్, కో-కన్వీనర్‌గా పద్మజ పురుషోత్తమరావు బాధ్యతలు చేపట్టనున్నారు. సేవా కన్వీనర్లుగా శ్యామల రమేష్, వడ్లకొండ సత్యనారాయణ, ప్రచార కన్వీనర్లుగా కడియాల రాజన్న, భువనగిరి రమేష్ నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుగా సజ్జనపు శ్యాం, సాయిని కృష్ణమూర్తిని నియమించినట్లు అర్చకులు వెల్లడించారు.

### నూతన కమిటీకి అభినందనలు

నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులను శ్రీ సీతారామ సేవా సదన్ వ్యవస్థాపకులు గట్టు నారాయణ గురూజీ, సదన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు అభినందించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# పంటల రక్షణ పేరుతో కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు!

- అటవీ జంతువుల కోసం విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయొద్దు
- పంటల రక్షణకు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి: ములుగు డీఎస్పీ రవీందర్




**ములుగు, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** అటవీ జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు పొలాల్లో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు డీఎస్పీ రవీందర్ హెచ్చరించారు. పంటల రక్షణ పేరుతో ఏర్పాటు చేసే విద్యుత్ ఉచ్చుల కారణంగా మనుషుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తులు మృత్యువాత పడటంతో వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ములుగు మండలంలోని జాకారం గ్రామ పంచాయతీ పరిధిలో పంట పొలాల్లో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయడం వల్ల ప్రాణనష్టం సంభవించిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారు చట్టపరమైన చర్యలు ఎదుర్కొని జైలుపాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు పంటలను అటవీ జంతువుల నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ ఉచ్చులకు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని డీఎస్పీ సూచించారు. ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రమాదకర పద్ధతులకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసినట్లు తెలిసినా, కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీస్ సేవలందించాలి

- ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత



**వరంగల్, అక్టోబర్ 22 (నిత్యం నిఘా):** పోలీస్ స్టేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పోలీసు సిబ్బందికి సూచించారు. గురువారం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శుఖూర్‌కు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సీపీ ఎన్. శ్వేత స్పష్టం చేశారు. ఈ తనిఖీలో వరంగల్ ఇన్‌చార్జి ఏసీపీ నర్సింహారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

# బండి వీరన్న చిత్రపటానికి నివాళులర్పించిన గుండు సుధారాణి



**వరంగల్, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఖిలా వరంగల్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బండి వీరన్న ఇటీవల మృతి చెందడంతో, గురువారం నిర్వహించిన ఆయన 11వ రోజు పెద్దకర్మ కార్యక్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.బండి వీరన్న నివాసంలో ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమానికి హాజరైన గుండు సుధారాణి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వీరన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు బండి కుమారస్వామి, ఓగిలిశెట్టి అనిల్ కుమార్, లక్కాకుల శ్యామ్, తోట రమేష్, కొమ్మిని రాజేందర్, బొల్లం ప్రతాప్, పల్లం రాజు, దామెరకొండ వెంకన్న, బండి మోహన్ తదితరులు పాల్గొని బండి వీరన్న చిత్రపటానికి నివాళులర్పించారు

# వాకింగ్‌కు వచ్చే మహిళలు భద్రతా నియమాలు పాటించాలి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి సూచన

**హనుమకొండ, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై ఉదయం వేళల్లో వాకింగ్ చేసే మహిళలు, యువతుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి సూచించారు. మహిళలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ చేస్తున్న పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డిని స్థానిక వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్‌పై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా, ఆరోగ్య కార్యక్రమాలను సీపీకి వివరించారు.ప్రతిరోజూ ఉదయం సుమారు 450 మందికి పైగా వాకర్స్ ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ ట్రాక్‌ను వినియోగిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

### మహిళల భద్రతకు పోలీసుల ప్రాధాన్యం

ఈ సందర్భంగా సీపీ శ్వేతారెడ్డి మాట్లాడుతూ, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలు, యువతులు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒంటరిగా వాకింగ్‌కు వచ్చే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా, ఏవైనా ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. మహిళల భద్రత, ప్రజల రక్షణకు సంబంధించి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



# పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు పండుగ సాయన్న

- ఆయన పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం.. భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**భూపాలపల్లి, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి ):** తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం పోరాడటం పండుగ సాయన్న జీవితంలో ప్రధానమైన విలువలని గుర్తుచేశారు. సమాజంలో సమానత్వం, మానవత్వం, సేవాభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కాశీరాం, పూర్ణచందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

**వరంగల్ జిల్లా/వర్ధన్నపేట, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** పెత్తందారుల దోపిడీని ఎదిరించి, పీడిత ప్రజల పక్షాన పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్ అన్నారు. అణచివేతకు తలవంచని పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంతో పాటు వర్ధన్నపేట పట్టణంలో ముదిరాజ్ కులబంధువులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి, పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఆయన పోరాట చరిత్రను స్మరించుకుంటూ, ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

### పెత్తందారులపై పోరాటమే సాయన్న చరిత్ర

వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని గాంధీ సెంటర్‌లో నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని భీంరాజ్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్, కార్యదర్శి పాన్నం స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెనుగ (ముదిరాజ్) సామాజిక వర్గానికి చెందిన పండుగ సాయన్న బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహావీరుడని కొనియాడారు. పాలమూరు ప్రాంతంలోని నవాబ్‌పేట, మిరిగోన్ గ్రామంలో అనంతయ్య, సాయమ్మ దంపతులకు జన్మించిన సాయన్న, నాటి పెత్తందారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు సాగించారని తెలిపారు.

నిజాం పాలనలో అధికార బలం, భూస్వామ్య పెత్తనం ప్రజలను అణచివేస్తున్న సమయంలో సాయన్న ప్రజల పక్షాన నిలిచారని పేర్కొన్నారు. ఆయనను బందిపోటుగా ముద్రవేసి, తప్పుడు కేసులతో వేధించి, చివరకు హతమార్చినట్లు నాయకులు వివరించారు. సాయన్న జీవితం అన్యాయాన్ని ఎదిరించే ధైర్యానికి, సామాజిక న్యాయం కోసం పోరాడే తత్వానికి నిదర్శనమని అన్నారు.

### సాయన్న ఆశయాల సాధనకు ఐక్యతే ఆయుధం

ముదిరాజ్ జాతి అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిట్టల భాస్కర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సాయన్న తమ సామాజిక వర్గంలో జన్మించడం గర్వకారణమని, ఆయన త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సామాజిక సమానత్వం, జాతి ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కులపెద్దలు పిట్టల కుమారస్వామి, మట్టపల్లి సుభాష్, పెద్దమ్మతల్లి పరపతి సంఘం అధ్యక్షుడు పిట్టల రాజు, మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు కుమ్మం రాములు, కార్యదర్శి కొండ ఉపయోగం, డైరెక్టర్లు సుంకరి ప్రశాంత్, మట్టపల్లి సురేష్, పిట్టల శివ, చెన్నబోయిన యాకయ్య, ముద్రబోయిన సాంబరాజు, బుస్స ఎల్లస్వామి, అనుమాస ప్రేమ్ ప్రసాద్, మాజీ కమిటీ సభ్యులు సుంకరి స్వామి, సుంకరి బిక్షపతి, వీరస్వామి, పండుగ బాబు, నిమ్మనబోయిన పైడి, కోలిపాక లింగయ్య, బచ్చల స్వామి తదితరులు పాల్గొన్నారు.



### వర్ధన్నపేటలోనూ ఘనంగా జయంతి వేడుకలు

వర్ధన్నపేట మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ సెంటర్‌లో మండల అధ్యక్షుడు పిట్టల భాస్కర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా భాస్కర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి అభ్యున్నతితో పాటు బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సాయన్న చేసిన పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన త్యాగస్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, కుల బంధువులంతా ఐకమత్యంతో ఉంటూ జాతి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని భీంరాజ్, మండల ఉపాధ్యక్షులు నారెల్లి సుధాకర్, శ్రీనివాస్, మండల కార్యదర్శి పాన్నం స్వామి, బచ్చల స్వామి, మండల యువజన అధ్యక్షుడు కుక్కల రాకేష్, ఉపాధ్యక్షుడు బాతు సతీష్, కార్యదర్శి ముద్రబోయిన సాంబరాజు, వర్ధన్నపేట సొసైటీ అధ్యక్షుడు భూమా సుధాకర్, భూమా శ్రీను, ఎద్దు వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యుడు బొల్లు శ్రీను, బోనాల వెంకన్న, నారెల్లి సురేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# స్నేహభావానికి, మంచితనానికి ప్రతిరూపం మహావాది సతీష్ కుమార్

- **మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు**



**పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి ):** మంచితనం, మృదుస్వభావం, స్నేహభావంతో అందరి మన్ననలు పొందుతున్న మన తెలంగాణ దినపత్రిక సీనియర్ పాత్రికేయుడు, మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొడారి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో, మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు, సీనియర్ పాత్రికేయుడు కొండేల మారుతి సౌజన్యంతో ప్రెస్ క్లబ్‌లో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సభ్యులు సతీష్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆయన వ్యక్తిత్వాన్ని, పాత్రికేయ సేవలను కొనియాడారు.

### మంచితనం, స్నేహభావం ఆయన ప్రత్యేకత

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొడారి మల్లేష్ యాదవ్, సీనియర్ పాత్రికేయుడు కొండేల మారుతి మాట్లాడుతూ.. మహావాది సతీష్ కుమార్ పాత్రికేయ వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేస్తూ, తోటి పాత్రికేయులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యమిస్తూ, ఇతరులకు సహాయం అందించాలనే సేవాభావం కలిగి ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు.

సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని, ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడమే పాత్రికేయ వృత్తి ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రధాన కార్యదర్శిగా సతీష్ కుమార్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. స్నేహానికి విలువనిస్తూ, అందరినీ కలుపుకుపోయే ఆయన వ్యక్తిత్వం తోటి పాత్రికేయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

### ఆయురారోగ్యాలతో మరిన్ని విజయాలు సాధించాలి

మహావాది సతీష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాత్రికేయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు, సమాజానికి మరిన్ని సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

సభ్యుల మధ్య ఆత్మీయత, ఐక్యత, స్నేహబంధాన్ని చాటిచెప్పిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మెడగొని రాజమౌళి గౌడ్, మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ మండల కన్వీనర్ ఏగోలపు సంతోష్ గౌడ్, పాత్రికేయులు సుబాన్, మంథని లక్ష్మణ్, మాదేశి శ్రావణ్ కుమార్, కావేటి సమ్మయ్య తదితరులు పాల్గొని మహావాది సతీష్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ముదిరాజుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

- **రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయి..**
- **ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలిఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**



**మహబూబాబాద్, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):**తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్నాయని, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ముదిరాజుల జనాభాకు అనుగుణంగా సంక్షేమ ఫలాలు అందించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కీర్తిశేషులు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ముదిరాజులను అభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముదిరాజులను చైతన్యపరిచి, వారి హక్కులు, అభివృద్ధి కోసం సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు.తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాలు, సేవలను వివరించారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.జీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సాయి శ్రీజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పురుషోత్తం, జిల్లా నాయకులు సహదేవ్ ముదిరాజ్, కొత్తూరు రమేష్ ముదిరాజ్, కొండ్ర ఎల్లయ్య, డాక్టర్ పరికిపండ్ల అశోక్, సూరబోయిన రవి ముదిరాజ్, అలువాల సోమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీరుటి లక్ష్మీనారాయణ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నాయకులు, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు పండుగ సాయన్న జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని వివరించే లఘుచిత్రాన్ని ప్రదర్శించారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- **ఆత్మకూరులో వ్యాధి గుర్తింపు సర్వే ప్రారంభించిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య**
- **అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి**





**హనుమకొండ, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):**కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య పిలుపునిచ్చారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా వైకల్యాలను నివారించడంతోపాటు వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు.జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు ప్రచార కార్యక్రమం (ఎల్‌సీడీసీ) సర్వేను డీఎంహెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వారిని గుర్తించి వైద్య పరీక్షల కోసం సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. సాధారణ చర్మపు రంగు కంటే తక్కువ రంగులో లేదా రాగి రంగులో మచ్చలు కనిపించడం, ఆ మచ్చలపై స్పర్శ జ్ఞానం తగ్గడం లేదా పూర్తిగా లేకపోవడం కుష్టు వ్యాధి ప్రధాన లక్షణాలని వివరించారు. వ్యాధి నరాలను ప్రభావితం చేసినప్పుడు చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ జ్ఞానం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చన్నారు. వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.కుష్టు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్స ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధిపై భయాందోళనలకు గురికావద్దని, బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్వేలో గుర్తించిన అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.అదనపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. మదన్ మోహన్ రావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి సాధారణంగా మూడు నుంచి ఐదు సంవత్సరాలు పట్టవచ్చన్నారు. ఇది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని, శాపం లేదా పాపం వల్ల కూడా రాదని స్పష్టం చేశారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి రకాన్ని బట్టి సాధారణంగా ఆరు నుంచి పన్నెండు నెలల పాటు చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలందరూ సహకరించి ఆరోగ్య సిబ్బందికి అవసరమైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్పందన, ఆరోగ్య విద్యాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారులు రవీందర్, ఎల్లయ్య, దేవ్ సింగ్, సామాజిక ఆరోగ్యాధికారి జునేధి, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# పాలకుర్తిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**జనగామ జిల్లా, పాలకుర్తి, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి):** పాలకుర్తి పట్టణంలోని గుడివాడ చౌరస్తాలో పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవితం, పోరాట పటిమ, ప్రజల కోసం చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను, సేవలను భావితరాలకు తెలియజేయడంతో పాటు, ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి ముదిరాజ్ సంఘం సభ్యులు, స్థానికులు, అభిమానులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొని పండుగ సాయన్నకు నివాళులర్పించారు.

# నాణ్యతతో మోడల్ బస్‌స్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- **ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..**
- **అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం**



**ములుగు, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి ):**ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, బస్‌స్టాండ్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఫ్లోరింగ్‌తో పాటు వివిధ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్‌స్టాండ్ ప్రజలకు రవాణా సౌకర్యాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు చేపట్టాలని, పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు సజావుగా సాగేలా చూడాలన్నారు.ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని, తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మిగిలిన పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, మోడల్ బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైజాగ్ కరాటే పోటీలకు ఏటూరునాగారం విద్యార్థులు

**- ఏడుగురు క్రీడాకారులకు ఆర్థిక చేయూత అందించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, సర్పంచ్ శ్రీలత**




**ఏటూరునాగారం, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి ) :** ములుగు జిల్లా ఏటూరునాగారం కరాటే అకాడమీకి చెందిన ఏడుగురు విద్యార్థులు వైజాగ్ వేదికగా జరగనున్న ప్రతిష్ఠాత్మక కియో దక్షిణ మండల కరాటే పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటుతూ ఉన్నతస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న ఈ యువ క్రీడాకారులకు ప్రయాణ, పోటీల ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు క్రీడాకారుల ప్రతిభకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో వారు అందించిన చేయూత విద్యార్థులకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభకు సరైన గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, వైజాగ్‌లో జరగనున్న కరాటే పోటీల్లో ఏటూరునాగారం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏటూరునాగారానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు పట్టుదలతో సాధన చేసి విజయాలు సాధించాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సమయానికి ఆర్థిక సహాయం అందించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు, సర్పంచ్ శ్రీలతకు ఏటూరునాగారం కరాటే అకాడమీ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అబ్బు హుసేన్, విద్యార్థుల తల్లిదండ్రులు, సాక్షి విలేకరి అల్వాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెకు జనసేన మద్దతు

- **జనసేన రాష్ట్ర నాయకులు, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మీసాల శ్రీనివాస్ మద్దతు**



**నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 22 :** జిల్లాలోని జాతీయ ఆరోగ్య పథకం (ఎన్ హెచ్ఎం) ఉద్యోగులు గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తసమ్మెలో భాగంగాధర్నాచౌక్ లో సమ్మెను ఉద్యోగులు కొనసాగిస్తున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం కనికరించడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నాయకులు మీసాల శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించి నిరసనకు మద్దతు తెలిపిన తర్వాత మాట్లాడుతూ....ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం డిమాండ్ల పై స్పందించకుంటేజనసేన ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు.వైద్యశాఖలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులు తమ హక్కుల కోసం రోజుల తరబడి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు వీరికి మద్దతుగా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.ఉద్యోగులకు పనికి తగిన వేతనాలు ఇవ్వాలన్నారు.నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలన్నారు.ఉద్యోగభద్రత కల్పించాలన్నారు.గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి వీరికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, హామీ నిలబెట్టుకోలేని రేవంత్ భవిష్యత్తులో చేతగాని వ్యక్తిగా నిలిచిపోతారని హేళన చేశారు.వీపావళి లోపుతక్షణమే ప్రభుత్వం సబ్ కమిటీని వేసి వీరి న్యాయమైన కోరికలను తీర్చాలని డిమాండ్ చేశారు.

# 4వ రోజుకు చేరుకున్న తుల్జాపూర్ పాదయాత్ర.



**నిత్యం నిఘా, సంగారెడ్డి, అక్టోబర్ 22 :** సదాశివపేట నుండి దసరా నాడు ప్రారంభించిన తుల్జాపూర్ పాదయాత్ర నేటికి నాలుగు రోజులు పూర్తయ్యాయి. సుమారు 150 కిలోమీటర్ల వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర బయలుదేరిన వారిలో మాజీ కౌన్సిలర్ బిజెపి నాయకులు ఓదెల మాణిక్ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుల్జాపూర్ వరకు మరో నాలుగు రోజులు పాదయాత్ర ద్వారా చేరుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తుల్జాపూర్ యాత్ర వెళ్లడం జరుగుతుందన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటానని తెలిపారు. తుల్జాపూర్ చేరుకున్నాక అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రలో సుమారుగా 15 మందితో కలిసి వెళ్లారు. ఇందులో కుమ్మరి శ్రీశైలం, నాగుల నరేష్, గోపాల్, వీరన్న, ప్రవీణ్, సాయికుమార్, పవన్ మిత్ర బృందం తదితరులు పాదయాత్రకు బయలుదేరి వెళ్లడం జరిగింది.

# గీతం యూనివర్సిటీలో టీజీపీఎస్సీ

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.





**నిత్యం నిఘా, సంగారెడ్డి, అక్టోబర్ 22 :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో 24.10.2026న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్ (CBRT) నేపథ్యంలో, రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద చేపట్టనున్న పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్పీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఇస్నాపూర్ ఇన్స్పెక్టర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, గీతం యూనివర్సిటీ యాజమాన్యం వర్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

# మల్లంపల్లి మైనింగ్.. తనిఖీలు ఏవి? పర్యవేక్షణ ఎక్కడ?



**ములుగు జిల్లా, మల్లంపల్లి, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి) :** మల్లంపల్లి పరిసరాల్లో మైనింగ్ కార్యకలాపాల నిర్వహణ, తవ్వకాల అనుమతులు, ప్రభుత్వ రాయల్టీ వసూళ్లు, పర్యావరణ నిబంధనల అమలుపై సమగ్ర పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందనే చర్చకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఖనిజ సంపద వెలికితీత ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, తవ్వకాలు నిబంధనలకు అనుగుణంగా సాగుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత. అయితే మైనింగ్ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోందా? అనుమతించిన పరిధిలోనే తవ్వకాలు కొనసాగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా?

మల్లంపల్లి పరిసరాల్లో మైనింగ్ నిర్వహిస్తున్న ప్రాంతాలకు సంబంధించి మంజూరైన అనుమతులు, లీజు వివరాలు, సర్వే నంబర్లు, తవ్వకాలకు కేటాయించిన విస్తీర్ణం, అనుమతించిన ఖనిజ పరిమాణాన్ని అధికారులు పరిశీలించాలి. అనుమతించిన ప్రాంతంలోనే తవ్వకాలు జరుగుతున్నాయా? నిర్ణీత పరిమితులకు మించి తవ్వకాలు చేపడుతున్నారా? అవసరమైన పత్రాలు, అనుమతులు అందుబాటులో ఉన్నాయా? అనే అంశాలపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలి.
కేవలం కార్యాలయాల్లో రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా, మైనింగ్ ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలి. నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే వాటి తీవ్రతను బట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

### రాయల్టీ వసూళ్లపై సమగ్ర తనిఖీలు అవసరం!

మైనింగ్ ద్వారా వెలికితీసే ఖనిజాలకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ, వర్తించే ఇతర రుసుములు సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా అన్నది అధికారులు నిర్ధారించాలి. తవ్విన ఖనిజ పరిమాణం, రవాణా చేసిన ఖనిజం, రవాణా పత్రాలు, రాయల్టీ చెల్లింపుల వివరాలను సరిపోల్చి పరిశీలించాలి.
రికార్డుల్లో నమోదైన పరిమాణానికి, వాస్తవంగా తవ్విన లేదా రవాణా చేసిన ఖనిజానికి మధ్య వ్యత్యాసాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా తనిఖీ చేయాలి. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

### పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్యం వద్దు!

మైనింగ్ కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో ధూళి నియంత్రణ, ఖనిజ రవాణా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తవ్వకాల భద్రత, అవసరమైన పర్యావరణ అనుమతులు, సంబంధిత నిబంధనల అమలును అధికారులు పరిశీలించాలి. సమీప గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ భూములపై తవ్వకాల ప్రభావం పడకుండా తగిన చర్యలు చేపట్టాలి. పర్యావరణానికి హాని కలిగించే విధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తనిఖీల్లో గుర్తిస్తే సంబంధిత శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలి. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, చట్టబద్ధమైన మైనింగ్ నిర్వహణ జరిగేలా పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి.

### అధికారుల పర్యవేక్షణపై స్పష్టత ఏది?


మల్లంపల్లి పరిసరాల్లో మైనింగ్ కార్యకలాపాలపై గనుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయాన్ని పర్యవేక్షించే వ్యవస్థ ఎంత సమర్థవంతంగా పనిచేస్తోంది? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. తనిఖీలు నిర్వహించినట్లయితే వాటి వివరాలు, గుర్తించిన ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలపై పారదర్శకత ఉండాలి. ఉల్లంఘనలు లేవని నిర్ధారణ అయినా ఆ విషయాన్ని అధికారిక రికార్డుల ఆధారంగా వెల్లడించాలి. దీనివల్ల ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం లభించడంతో పాటు, ప్రభుత్వ శాఖలపై విశ్వాసం పెరుగుతుంది.

### పారదర్శకమైన మైనింగ్ నిర్వహణే లక్ష్యం కావాలి

ఖనిజ సంపద ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉండటంతో పాటు, దాని వెలికితీతలో చట్టాలు, పర్యావరణ నిబంధనలు కచ్చితంగా అమలవడం అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో మల్లంపల్లి పరిసరాల్లోని మైనింగ్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి, అనుమతులు, తవ్వకాల పరిమితులు, రాయల్టీ చెల్లింపులు, పర్యావరణ నిబంధనల అమలుపై వాస్తవాలను వెల్లడించాలి. ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గృహజ్యోతి పథకానికి దూరమవుతున్న లబ్ధిదారులు..!

- **ఎండల తీవ్రతతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం..**
- **200 యూనిట్ల పరిమితిపై సడలింపు ఇవ్వాలని వినతి**




**హనుమకొండ, అక్టోబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి) :** పేద, మధ్యతర గతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కొందరికి ఆశించిన స్థాయిలో ప్రయోజనం అందించలేకపోతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్ల వినియోగం పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా అధికమవుతోంది. ఫలితంగా నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తేనే ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందే నిబంధన కారణంగా కొన్ని కుటుంబాలు పథకానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు పేద కుటుంబాలు సైతం ఫ్యాన్లు, కూలర్లను ఎక్కువ సమయం వినియోగించాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో పరిమితిలోపు ఉండే విద్యుత్ వినియోగం ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు 200 యూనిట్లను దాటే అవకాశం ఉంటోంది. దీంతో నెలంతా పాదుపుగా విద్యుత్ వినియోగించినప్పటికీ, ఎండల కారణంగా పెరిగిన వినియోగం కొందరు లబ్ధిదారులకు భారంగా మారుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. అయితే వేసవి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే పరిమితిని అమలు చేయడం వల్ల పథకంపై ఆధారపడిన కుటుంబాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీ పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలకు విద్యుత్ బిల్లులు అదనపు భారంగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో అవసరమైనప్పటికీ విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించకుండా ఉండటం వేసవిలో సాధ్యం కాదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత, మరోవైపు కుటుంబ బడ్జెట్‌ను సమతుల్యం చేసుకోవడం కష్టంగా మారుతోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరిగే పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల పరిమితిపై పునరాలోచించి, అర్హులైన పేద కుటుంబాలకు మరింత ఉపశమనం కలిగించేలా తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారుల ఇబ్బందులను పరిశీలిస్తుందా, లేక ప్రస్తుత నిబంధనలే కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# ధాన్యం కొనుగోళ్లకు కోతకు ముందే దళారీల "కోతలు "

- పెట్టుబడి పేరుతో వ్యాపారుల వేధింపులు
- రసీదులు లేకుండానే ఎరువులు, పురుగు మందుల విక్రయాలు
- అఖినేపల్లి మల్లారంలో రైతుల సమైఖ్యతా సమావేశం





**నిత్యం నిఘా, పినపాక, అక్టోబర్ 22 :**
పంట చేతికి రాకముందే దళారులు, స్థానిక ఎరువులు-పురుగు మందుల వ్యాపారులు అక్రమ షరతులతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోళ్ల సమస్యలు, వ్యాపారుల ఒత్తిడిపై గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం అఖినేపల్లి మల్లారంలో రైతుల సమైఖ్యతా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ సాగు సమయంలో పెట్టుబడి పేరుతో ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించే సమయంలో వ్యాపారులు ఎలాంటి బిల్లులు, పక్కా రసీదులు ఇవ్వడం లేదని ఆరోపించారు. తాము ముందుగానే పెట్టుబడి ఇచ్చామనే సాకుతో, పండిన ధాన్యాన్ని, ఇతర పంట ఉత్పత్తులను తమకే విక్రయించాలని, తమ ఇష్టారాజ్యంగా నిర్ణయించిన తక్కువ ధరలకే ఇవ్వాలని వ్యాపారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు.దళారీల అక్రమాలు – నష్టపోతున్న రైతాంగం:పినపాక మండలంలోని జానంపేట, టీ.కొత్తగూడెం, దుగినేపల్లి, ఏడూళ్ల బయ్యారం, ఐలాపురం, సీతంపేట, పినపాక గ్రామాలతో పాటు ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతమైన అఖినేపల్లి మల్లారం సరిహద్దు గ్రామాల్లో దళారుల జోక్యం హద్దులు దాటిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ, తరుగు పేరుతో అదనపు కోతలు విధించడం వల్ల ఎకరానికి వేల రూపాయల నష్టం వాటిల్లుతోందని తెలిపారు.అంతేకాకుండా, బయటి ప్రాంతాల నుండి వచ్చే కొనుగోలుదారులను గ్రామాల్లోకి రాకుండా స్థానిక దళారీ సిండికేట్ అడ్డుకుంటోందని, దీనివల్ల తమ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల తక్షణమే చర్యలు తీసుకోవాలి!రైతులపై వ్యాపారుల అక్రమ ఒత్తిళ్లను అరికట్టడానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సమావేశంలో డిమాండ్ చేశారు.ఎరువులు, పురుగుమందుల విక్రయాలలో ప్రతి రైతుకూ తప్పనిసరిగా రసీదులు/బిల్లులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలి.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తరుగు, తేమ నమోదు పారదర్శకంగా ఉండేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలి.ఇతర కొనుగోలుదారులను అడ్డుకునే దళారులపై కఠిన చర్యలు తీసుకుని, రైతులకు స్వేచ్ఛగా పంట విక్రయించే వాతావరణం కల్పించాలి.సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించి తమ సమస్యలను పరిష్కరించి, మద్దతు ధర దక్కేలా చూడాలని పినపాక ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు.

# కొత్తపేట ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా కామ్లేకార్ సందీప్ ఏకగ్రీవ ఎన్నిక

- సంఘం అభివృద్ధికి, ఐక్యతకు కృషి చేస్తా: నూతన అధ్యక్షుడు సందీప్



**నిత్యం నిఘా, కేశంపేట, అక్టోబర్ 22 :**
రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నూతన ఆరెకటిక సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం రాష్ట్ర నాయకుడు కామ్లేకార్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సంఘం అభివృద్ధి, సభ్యుల ఐక్యత, సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కామ్లేకార్ సందీప్, ఉపాధ్యక్షులుగా కామ్లేకార్ వినయ్ కుమార్, కామ్లేకార్ రవీందర్, రాఘవేందర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కామ్లేకార్ నాగరాజు, సహాయ కార్యదర్శిగా కామ్లేకార్ రమేష్, కోశాధికారిగా శివకుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రచార కార్యదర్శులుగా కామ్లేకార్ ప్రేమ్ కుమార్, కామ్లేకార్ కార్తీక్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కామ్లేకార్ సందీప్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, యువతను సంఘటితం చేస్తూ సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సంఘం ఐక్యతను కాపాడుతూ అందరి సహకారంతో అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదయ్య, రాజు, నర్సింగ్, కృష్ణజీ, మహేష్, నవీన్, విజయ్, ప్రవీణ్, శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# నేల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా 'ఖేత్ బచావో అభియాన్'






**నిత్యం నిఘా, కరకగూడెం, అక్టోబర్ 22 :**
నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు ఈ అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోనూ అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, సహజ వనరులను సంరక్షించడం, దీర్ఘకాలికంగా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు.అనంతారం, కరకగూడెంలో అవగాహన సదస్సులు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని అనంతారం మరియు కరకగూడెం రైతు వేదికలలో బుధవారం 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏడీఏ తాతారావు, ఏవో ఛటర్జీ, ఏఈవోలు అనిల్, రామాదేవి హాజరై రైతులకు నేల ఆరోగ్య ప్రాముఖ్యత, కేంద్రీయ ఎరువుల వాడకం, పంటల మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సమావేశాల్లో అనంతారం సర్పంచ్, ఉప సర్పంచ్ తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# టేకు కలప కొనుగోలుకు బంపర్ అవకాశం!

- జన్నారం ప్రభుత్వ కలప డిపోలో రేపు బహిరంగ వేలం.
- నాణ్యమైన స్థానిక టేకు కలప కొనుగోలుకు వ్యాపారులకు సువర్ణావకాశం.




**నిత్యం నిఘా, జన్నారం, అక్టోబర్ 22 :** కలప వ్యాపారులు, కొనుగోలుదారులకు అటవీ శాఖ శుభవార్త అందించింది. జన్నారం ప్రభుత్వ కలప డిపోలో అక్టోబర్ 23న టేకు, టేకుయేతర కలప లాట్ల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ వెల్లడించారు. స్థానిక అటవీ ప్రాంతానికి చెందిన నాణ్యమైన టేకు కలపను వేలం ద్వారా కొనుగోలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశంగా నిలవనుందని ఆయన అన్నారు నిర్మాణ రంగం, ఫర్నిచర్ తయారీ,కలప ఆధారిత పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం కలపను కొనుగోలు చేయాలనుకునే వ్యాపారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అటవీ శాఖ కోరింది.జన్నారం ప్రభుత్వ కలప డిపోలో నిర్వహించే ఈ బహిరంగ వేలంలో అర్హులైన కలప వ్యాపారులు, కొనుగోలుదారులు పాల్గొని తమకు అవసరమైన కలపను కొనుగోలు చేయాలని ఎఫ్డివో రామ్మోహన్ విజ్ఞప్తి చేశారు

# మద్గుల్ చిట్టెంపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన అర్ద సుధాకర్ రెడ్డి

- పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం







**నిత్యం నిఘా, వికారాబాద్ , అక్టోబర్ 22 :** వికారాబాద్: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ద సుధాకర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టెంపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సొంత ఇల్లు పేద కుటుంబాలకు భరోసానిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వినోద్ కుమార్, సుధాకర్, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, వెంకటయ్య గౌడ్, సీహెచ్ రవి, శీను, నరసింహులు, లాలయ్య, రాములు రాజు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి వేడుకల్లో ఎలిమినేడు కురుమ సంఘం సభ్యులు

- దసరా సంబరాలలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి





**నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 22 :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో మంగళవారం రోజున దసరా పండుగ సంబరాలను కురుమ సంఘం సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం బీరప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గ్రామంలో ఉన్నటువంటి అంజనేయ స్వామిని ఆశీస్సులు అందుకున్నారు. దుర్గామాత ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం జమ్మి చెట్టు వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. ఆప్యాయతలు పంచుకుంటూ ఆత్మీయతను చాటుకుంటూ సాగిన ఈ వేడుకలు పల్లె సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పాయి పండుగ సందడితో కళకళలాడిన పల్లెలో బతుకమ్మ ఆటపాటలు ఆత్మీయ పలకరింపులు సాంప్రదాయ ఆచారాలు ఆనందోత్సవాలతో కలగలిసి విజయదశమి వేడుకలు జరుపుకున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఎలిమినేడు గ్రామంలో ఉన్నటువంటి వ్యవసాయ క్షేత్రంలో కలిసి కురుమ సంఘం సభ్యులు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ కొట్టాముల మల్లేష్, సెల్వోజి సూధ లక్ష్మయ్య,కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు కొట్టాముల పెద్దశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టాముల శ్రీశైలం గ్రామ పెద్దలు,యూత్ సభ్యులు, యువత,మహిళలు,కురుమ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు.....

- పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి





**నిత్యం నిఘా, మేడ్చల్–మల్కాజిగిరి, అక్టోబర్ 22 :**
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పండుగ సాయన్నను స్మరించుకున్నారు. తెలంగాణ చరిత్రలో గుర్తింపు పొందిన ఆయన జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివరావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు, లీడ్ జిల్లా మేనేజర్ సి.శివప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, కలెక్టరేట్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగ సాయన్న ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం

- జయంతి వేడుకలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి







**నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 22 :**
అణగారిన,బడుగు బలహీన వర్గాల వారి కోసం పండుగ సాయన్న కనబరచిన ధైర్య సాహసాలు,చూపిన తెగువ అందరికీ స్ఫూర్తిదాయకం అని రాష్ట్ర శాసన మండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.పండుగ సాయన్న 174వ జయంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించారు.ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరు కాగా,కలెక్టర్ ఇలా త్రిపాఠి,నగర మేయర్ కే.ఉమారాణి,మాజీ ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంత్ రావు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొని పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ....పండుగ సాయన్న ఒక వ్యక్తిగా కాకుండా మహాశక్తిగా మారి ఆనాటి భూస్వాములు,దొరల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీరుడు అని కొనియాడారు.సామాజిక అసమానతలు,అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన సాయన్న సాహసం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని,ఆయన కేవలం ఒక్క ముదిరాజ్ వర్గానికే కాకుండా అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడని అన్నారు.ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు.సమానత్వం,సామాజిక న్యాయం కోసం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని,బీ.సీలకు జనాభా నిష్పత్తి మేరకు సరైన ప్రాతినిధ్యం కల్పించేందుకు కుల గణన జరిపించిందని,కేంద్రం ఆమోదం తెలుపనప్పటికీ స్థానిక సంస్థల్లో బీ.సీలకు మున్సిపల్ మేయర్,చైర్మన్ పదవులను 53 శాతం కేటాయించబడేలా చూశామన్నారు.ముదిరాజ్ లు రాజ్యాధికార సాధన దిశగా పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ. . . . భూస్వాములు, జమిందార్ల ఆగడాలు హెచ్చు స్థాయిలో ఉన్న ఆనాటి రోజుల్లోనే పండుగ సాయన్న వారికి వ్యతిరేకంగా బడుగు,బలహీన వర్గాల వారి కోసం చేసిన పోరాటం ఎంతో గొప్పదని అన్నారు.ఆయన స్ఫూర్తితో నేటి తరం వారు ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.విద్యతోనే అన్ని రంగాలలో రాణించడం జరుగుతుందని,భావితరాలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు,వారి హక్కులను వారు సాధించుకునేందుకు బాలబాలికలు అందరిని తప్పనిసరిగా చదివించాలని పిలుపునిచ్చారు. మహనీయుల ను స్మరించుకుంటూ,వారి స్ఫూర్తితో సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు పాటుపాడాలనే సదాశయంతో ప్రభుత్వం మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు.ఈ క్రమంలో పండుగ సాయన్న జయంతిని అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,జిల్లా బీ.సీ సంక్షేమ శాఖ అధికారి సాయికుమార్,నూడా చైర్మన్ కేశ వేణు,డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి,బొబ్బిలి రామకృష్ణ,ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కే.రమేష్,మెతుకు శివ,రవిరాజ్,నారాయణ,బీ.సీ సంఘాల నాయకులు,వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యం....

- కమలాపూర్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్.ఎం పై సస్పెన్షన్ వేటు



**నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 22 :**
నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అమర్ సింగ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.2026 సెప్టెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు పలు వార్తా పత్రికల్లో ప్రచురితమైన కథనాలతో పాటు సంబంధిత అధికారులకు అందిన ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్,ఈ ఉదంతంపై విచారణ జరిపించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం చోటుచేసుకున్నట్లు వెల్లడి కాగా,విచారణ నివేదిక ఆధారంగా,ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని ఇంచార్జి హెచ్.ఎం అమర్ సింగ్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ పథకాలు,ప్రయోజనాల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు.

# బాసర బ్రిడ్జి వద్ద దుర్గామాత విగ్రహాల నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్





**నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 22 :** బుధవారం అర్ధరాత్రి సమయంలో నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బాసర బ్రిడ్జి వద్ద దుర్గామాత విగ్రహాల నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది తమ విధుల పట్ల నీకచ్చిగా ఉండాలని అన్నారు.ఎక్కడ ఏలాంటి ఇబ్బందులు ఉన్న లేదా ఎలాంటి సమాచారం తెలిసిన తమ పై స్థాయి అధికారులకు హుటాహుటిన తెలియ జేయాల ని తెలిపారు.ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు కలగాకుండా ట్రాఫిక్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.బందోబస్తు లో అన్ని రకాల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.అలాగే అక్కడికి దుర్గాదేవి మాతలను తీసుకొచ్చిన భక్తులను అక్కడికి సంబంధించిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రజలందరూ సంబంధిత పోలీసు అధికారులకు,ట్రాఫిక్ సిబ్బందికి సహకరించగలరని అన్నారు.ఈ సందర్భంగా ఎ.ఆర్ ఎ.సి.పి కృష్ణ,సి.ఐ శ్రీనివాస్,ఎస్.ఐ లు,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు గలరు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వాహణ




**నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 22 :** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు అదనపు డి.సి.పి (అడ్మిన్)ఎన్. శుభం ప్రకాష్ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నిరంకుశ నిజాం పాలనలో దేశ్ ముఖ్ లు,దొరలు,భూస్వాముల అణచివేతతో పేద ప్రజలు అల్లాడిపోతున్న కాలంలో పుట్టిన పండుగ సాయన్న ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎదిరించే తెగువ ఉన్న నిజమైన ప్రజానాయకుడు అణగారిన వారికి ఆకలి తీర్చడమే ఆయన చేసిన అసలు సిసలైనటువంటి విప్లవం.ఆయన వీరత్వాన్ని పేదల పట్ల ఆయన చూపిన ప్రేమను నాటి జానపద కళాకారులు 12 మెట్ల కిన్నెర ద్వారా విరోచితంగా గానం చేస్తూ నేటికీ నేటి తరాలకు అందిస్తున్నారు.పండుగ సాయన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం కోసము అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం మనమంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎ.ఓ ఆసియా భేగం,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్,ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్,రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ ధరణి,పోలీస్ కార్యాలయం సిబ్బంది,సి.సి.ఆర్.బి సిబ్బంది,సి.ఎస్.బి సిబ్బంది,ఐ.టి కోర్ సిబ్బంది,పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది,సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది తదితరులు హాజరుకావడం జరిగింది.

# రాళ్లగూడలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



**నిత్యం నిఘా, శంషాబాద్, అక్టోబర్ 22 :** శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ 119వ డివిజన్ పరిధిలోని రాళ్లగూడలో ప్రధాన రహదారి, మురుగునీటి కాలువల పనులు అసంపూర్తిగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించి రహదారి, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కోరుతూ హెచ్‌జీసీఎల్, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. 119వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నాయకుల బృందం హెచ్ఎండీఏ కార్యాలయానికి వెళ్లి ఎండీ, సీఈ, డీఈలను కలిసి స్థానిక సమస్యలను వివరించింది. రాళ్లగూడ నుంచి కొత్వాల్‌గూడకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, వర్షం కురిసినప్పుడు మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. నెలల తరబడి పనులు నిలిచిపోవడంతో దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాళ్లగూడ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 118, 119 డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, ప్రధాన కార్యదర్శులు చిన్నగండు రాజేందర్, చిల్కమర్రి పరందాములు, ఉపాధ్యక్షులు మురళి గౌడ్, చరణ్, బీసీ సెల్ అధ్యక్షుడు విజయ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, నాయకులు శేఖర్, రమేష్ రాథోడ్, దర్శన్ గౌడ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కనకటి శివ, భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com